పల్లెకు చేరని వెలుగులు

- మారుమూల గ్రామాలకు లేని బస్సు సర్వీసులు
- రహదారి సౌకర్యం ఉన్నా పట్టింపులేని ఆర్టీసీ
- 'మహాలక్ష్మి'కి దూరమవుతున్న మహిళలు, విద్యార్థినులు


బస్సు సౌకర్యం లేని అశ్వాపురం-మొండికుంట రహదారి

అశ్వాపురం: అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది మారుమూల గ్రామాల పరిస్థితి. అశ్వాపురం మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలకు పల్లెవెలుగు బస్సు సేవలు అందడం లేదు. మండల పరిధిలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం ఉన్నా ఆర్టీసి అధికారులు బస్సులు నడపకపోవడంతో బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో కళాశాలలు, పాఠశాలలు సమయానికి రాలేక, ఆర్థికంగా నష్టపోతూ విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో ప్రజలు, విద్యార్థులు ఆటోలలో వ్యయ, ప్రయాసల కోర్చి ప్రయాణం చేస్తూ ఇబ్బంది పడుతున్నారు. బస్సులు నడపాలని అధికారులకు ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గిరిజన ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిధిలోని తుమ్మలచెరువు, గొంది గూడెం, గ్రామ పంచాయతీలలోని గ్రామాలకు పల్లెవెలుగు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అశ్వాపురం నుంచి గొందిగూడెం, తుమ్మలచెరువు మీదుగా మొండికుంట వరకు సుమారు 12 కిలో మీటర్లు రహదారి సౌకర్యం ఉంది. ఈ రహదారిపై బస్సులు నడపడానికి ఎటువంటి ఇబ్బంది లేదు. ఈ రహదారిపై బస్సులు నడిపితే తుమ్మలచెరువు, గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతుల గూడెం గ్రామ పంచాయతీలలో సుమారు 20 గిరిజన గ్రామాల ప్రజలకు ప్రయాణం సులువు అవుతుంది. కాని బస్సు లేదు.

విద్యార్థులు, మహిళల అవస్థలు..

పలు గ్రామాలకు పల్లెవెలుగు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, మహిళలు అష్టకష్టాలు పడుతున్నారు. మారుమూల గిరిజన గ్రామాల విద్యార్థులు ఆటోలలో ప్రయాణిస్తూ ఆర్థికంగా నష్టపోతూ సకాలంలో పాఠశాలలకు, కళాశాలలకు చేరలేక చదువులోను వెనుకబడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు అందకుండా పోతోంది.

పట్టించుకోని అధికారులు

ఉన్నతధికారులు స్పందించి రహదారి సౌకర్యం ఉన్న మారుమూల గ్రామాలకు పల్లెవెలుగు బస్సు సౌకర్యం కల్పించి ఇబ్బందులు తొలగించాలని గిరిజన ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో మహిళల నుంచి విశేష స్పందన వస్తుండటంతో మా గ్రామాలకు కూడా బస్సులు నడపాలని మహిళలు కోరుతున్నారు. సర్వీసులు పెంచితే ఆర్టీసీకి ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

బస్సులు నడపాలి



తుమ్మలచెరువు, గొందిగూడెం గ్రామ పంచాయతీలోని గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మారుమూల గ్రామాలకు బస్సులు నడపాలి.

– తాటి పూజిత, ఎంపీటీసీ, తుమ్మలచెరువు

బస్సులు నడిపితే ప్రయాణం సులువు

తుమ్మలచెరువు, గొందిగూడెం ప్రజలు అశ్వాపురం వెళ్లాలంటే ఆటోలలో ప్రయాణిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి ద్వారా ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. బస్సులు నడిపితే గిరిజనులకు ఆర్థిక భారం తగ్గుతుంది.

– పాయం భద్రమ్మ, సర్పంచ్, గొందిగూడెం

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులు ఆపరా?!

అశ్వాపురం: ఆర్‌టీసీ సిబ్బంది నిర్లక్ష్యంతో పాఠశాలలు, కళాశాలలకు దూర ప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహాలక్ష్మి ఉచిత బస్ ప్రయాణం వల్ల పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు రద్దీగా ఉంటున్నాయి డ్రైవర్లు, కండాక్టర్లు అశ్వాపురం, మొండికుంట వంటి ముఖ్యమైన స్టేజీలలో తప్ప బీజీకొత్తూరు, సీతరాంపురం, గొల్లగూడెం, జగ్గారం, గోపాలపురం స్టేజీలలో బస్సులు ఆపకపోవడంతో బస్సు పాస్‌లతో పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాలకు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు కళాశాలలకు సకాలంలో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. బస్సు ఖాళీ ఉన్నా ఆపడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మణుగూరు డిపో ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు అన్ని స్టేజీలలో ఆపేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి కల్యాణం


పూజలు చేస్తున్న భక్తులు

చండ్రుగొండ: మండలంలోని దామరచర్ల గ్రామంలో వేంచేసిఉన్న కోదండ రామాలయంలో సీతారామచంద్రస్వామి కళ్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ పంచమి, సీతామాతకు స్వయంవరం ప్రకటించిన రోజులను పురస్కరించుకుని సీతారాముల కళ్యాణోత్సవం జరిపించినట్లు పురోహితులు సూర్య శుబ్రమణ్యశర్మ, సత్య భాస్కరశర్మ తెలిపారు. సాంప్రదాయంగా సోమరాజు నర్సింహారావు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమంలో ప్రముఖులు గాదె శివప్రసాద్, గాదె వెంకటేశ్వరప్రసాద్‌లు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం నుంచి చండ్రుగొండ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు శివ, ప్రవీణ్‌లు రోడ్డుపక్కనే ఉన్న సూచికబోర్డును ఢీకున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తల భాగంలో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కొత్తగూడెంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

మణుగూరురూరల్: కుమారులు లేని ఓ తండ్రి మృతి చెందడంతో కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన ఆదివారం మణుగూరు పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో చోటుచేసుకుంది. కేత నరసింహారావు-గోపమ్మ దంపతులకు రజిత, సంతోషి కుమారి, జ్యోతి, రోజా, రాజేశ్వరి అనే ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఇటీవలే కేత నరసింహారావు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. మృతుడిని కుమారులు లేకపోవడంతో దహన సంస్కారాల బాధ్యతలను కుమార్తెలు తీసుకున్నారు. నలుగురు కుమార్తెలు తండ్రి పాడేను మోయగా.. హిందూ సంప్రదాయ ప్రకారం పెద్ద కుమార్తె రజిత తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టింది.

మృతుడి కుటుంబానికి చేయూత

బూర్గంపాడు: అంజనాపురం గ్రామానికి చెందిన గుగులోత్ సక్రు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా.. 1996లో అతనితో కలసి పదో తరగతి చదువుకున్న మిత్రబృందం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సక్కు కుటుంబ ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని ఆ కుటుంబానికి చేయూతగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే సక్రు అంతిమ సంస్కారాలకు రూ.15వేల తక్షణ సాయమందించారు. భవిష్యత్‌లో ఆ కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు. మిత్రబృందం సభ్యులు బి.రాములు, టి.హరిలాల్, వెంకటేశ్వర్లు తదితరులు చేయూతనందించిన వారిలో ఉన్నారు.

ఆలయానికి ఇన్వర్టర్ వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి ఆదివారం ఇన్వర్టర్‌ను వితరణగా అందించారు. ఆలయం, భక్తుల సౌకర్యం కోసం తిరుమలకుంట గ్రామానికి చెందిన కక్కిరాల లక్ష్మీనారాయణరావు, స్వరాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీనివాసరావు సుమారు రూ.20వేల విలువగల ఇన్వర్టర్‌ను ఆలయ కమిటీ బాధ్యులు ప్రసాద్‌కు అందజేయగా దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

వామనావతారంలో పర్ణశాల రాముడు


వామనావతారంలో రామయ్య..

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా ఐదవ రోజు ఆదివారం రామయ్యను వామనావతారంలో ఆలయ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, అమరవాది కిషోర్‌కుమారాచార్యులు, నరసింహచార్యులు అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అర్చకులు అనంతరం స్వామి వారిని వామనావతారంలో అలంకరించారు. పురాణాల ప్రకారం.. దేవతల సర్వసంపదలను తన స్వాధీనం చేసుకున్న రాక్షస రాజైన బలిచక్రవర్తి దగ్గరకి శ్రీహరి వామనరూపంలో వెళ్లి మూడు అడుగులు దానంగా స్వీకరించి ఒక అడుగుతో భూమిని, రెండో అడుగుతో ఆకాశాన్ని మూడో అడుగుతో త్రివిక్రముడై బలి తలపై మోపాడు. ఈ అవతారాన్ని దర్శించడం వలన గురుగ్రహ బాధలు తొలగుతాయ అర్చకులు వివరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఖమ్మానికి చెందిన శ్రీవాణి భాగవతారిణి ఆధ్వర్యంలో సీతాకల్యాణం హరికథను ప్రదర్శించారు. నేడు పరశురామావతారంలో దర్శనం ఇవ్వనున్న స్వామివారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరిండెంట్ కిషోర,ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణ



అశ్వాపురం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనుబంధ సంఘంగా ఏర్పడిన మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎమ్మెస్పీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఇసంపల్లి కృష్ణను నియమించారు. ఈ నెల 16న పాల్వంచలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కృష్ణను నియమించారు. ఆదివారం అశ్వాపురంలో కృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన మీద నమ్మకంతో నాకు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించిన జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వర్లు, వంగూరి ఆనందరావు, కొలిక పొంగు వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సమైక్య అధ్యక్షురాలిగా లత

భద్రాచలంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాజన మహిళా సమైక్య అధ్యక్షురాలిగా భద్రాచలం పట్టణానికి చెందిన మేకల లతను నియమిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్వంచ పట్టణంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన లతకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ...జిల్లాలో ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ పార్టీల అభివృద్ధికి కృషి చేస్తూ మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా సైదయ్య



సైదయ్య, మధు

చండ్రుగొండ: మున్నూరు కాపుసంఘం మండల అధ్యక్షుడిగా తిప్పనపల్లి గ్రామానికి చెందిన రామిశెట్టి సైదయ్య, ప్రధాన కార్యదర్శిగా వెలగల మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలకేంద్రం చండ్రుగొండలో ఆదివారం సంఘం నాయకులు సమావేశమైయ్యారు. ఉపాధ్యక్షుడిగా రంగిశెట్టి రామారావు, కోశాధికారిగా అంచ కృష్ణ, సహాయ కార్యదర్శిగా కూసాల లక్ష్మీపతి, సభ్యులుగా జీ శ్రీనివాసరావు, ఆర్ వెంకటేశ్వర్లు, జీ ప్రసాద్, భోగి కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా లంకా నర్సింహారావు, సలహాదారుడిగా శెట్టిపల్లి కృష్ణయ్యలను ఎన్నుకున్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబా సత్రంలో ధనుర్మాస ప్రారంభ పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీపారాధన, విష్ణు సహస్రనామ పారాయణం, సేవాకాలం, మంగళశాసనం, శాతుమురై, తీర్థ గోష్టి, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో తిరునగరి వెంకటేశ్వర్లు, రాజశేఖర్, శేషావతారం, భాస్కర్ సూరి, సత్యనారాయణ, పాంచజన్యం, వెంకటేశ్వర్లు, ప్రసాద్, పాండురంగమూర్తి, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన


రామాలయంలోని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సుడిగాలి పర్యటన చేశారు. ఆదివారం మండలంలోని బాలరాజుగూడెం, పట్వారిగూడెం, మల్కారం, దమ్మపేట, మొద్దులగూడెం, ఆసన్నగూడెం తదితర గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటనలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు పలు ఆలయాలు, చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామస్తులతో మమేకమై, వారితో ప్రత్యక్షంగా మాట్లాడి, బాగోగులు తెలుసుకున్నారు. పలు వివాహ శుభకార్యములకు హాజరై, వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, రాధకృష్ణ, రావు రవిశంకర్, పర్వతనేని ప్రసాద్, గోపిశాస్త్రి, పగడాల రాంబాబు, కెవి.సత్యనారాయణ, చిన్నశెట్టి చిట్టిబాబు పెదబాబు, పందేటి వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి

అశ్వాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు ఉచిత బస్ ప్రయాణం మంచి కార్యక్రమమైనప్పటికీ ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. అశ్వాపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆటోలపైనే ఆధారపడ్డ ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు జీవనభృతి నెలకు రూ.15వేలు చెల్లించాలని, ప్రతి డ్రైవర్‌కు రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సమయం కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బొల్లోజు అయోధ్యచారి

మణుగూరురూరల్: నేటి సమాజంలో విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని విశ్వబ్రాహ్మణుల సంఘం సీనియర్ నాయకులు బొల్లోజు అయోధ్యాచారి, సంఘం జిల్లా అధ్యక్షులు కాపర్తి వెంకటాచారి, పోలోజు వీరాచారి(పీవీచారి)లు అన్నారు. మండల పరిధిలోని తోగ్గూడెం సమ్మక్క-సారలమ్మ దేవాలయ ఆవరణలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. తొలిత తెలంగాణ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్‌సార్ చిత్రపటానికి సంఘ నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం సీనియర్ నాయకులు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యాచారి, ప్రముఖ కాంట్రాక్టర్ పీవి చారి, జిల్లా అధ్యక్షులు వెంకటాచారిలు హాజరై మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం పెద్దలను, అతిథులను సంఘ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఏఎం చారి, శంకరాచారి, గంగా చారి, శ్రీనివాసచారి, ధనుంజయ్, వీరభద్రం, బ్రహ్మం, కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల శంకర్, నామా వెంకటేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ కుల పెద్దలు, కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

జాతి అభివృద్ధికి కృషి


భద్రాచలంటౌన్: మంత్రిని సత్కరిస్తున్న కమ్మ సేవా సమితి సభ్యులు

భద్రాచలంటౌన్: ఉమ్మడి తెలుగు రాష్ట్రలలో కమ్మ జాతి అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాచలం కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మించిన సత్రంను మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. భద్రాద్రి సీతారామచంద్ర స్వామివారి సన్నిధిలో సత్రం ఏర్పాటే చేయడం సంతోషకరమన్నారు. కమ్మ జాతికి చెందిన వారు రాజకీయంగా, వ్యాపార పరంగా అభివృద్ధి చెందిన అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే తనను సంప్రదిస్తే సాధ్యమైనంత వరకు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాత మధు, తాళ్లూరి పంచక్షరయ్య, పాకాలపాటి రామారావు, చావా లక్ష్మీనారాయణ, చల్లగుళ్ల నాగేశ్వరరావు, అబ్బినేని శ్రీనివాసరావు, కొండబాల కోటేశ్వరరావు, బెజవాడ వెంకట్రావు, రాయల నాగేశ్వరరావు, ఏలూరి శ్రీనివాసరావు, రామారావు, వీరయ్య, కొడాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన అధికారులు

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయిల్‌ఫెడ్ మేనేజర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లిలో మంత్రి తుమ్మలను, ఆయన నివాసంలో ఆయిల్‌ఫెడ్ మేనేజర్లు బాలకృష్ణ, కళ్యాణ్‌లు మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మహాజన సంఘం నాయకులు..

మణుగూరురూరల్: భద్రాచలం పర్యటనలో భాగంగా సారపాక విశ్రాంతి భవనంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మణుగూరు మండల కమ్మ మహజన సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 24న మణుగూరు వెన్నెల జలపాతం వద్ద జరిగే కమ్మ మహజన సంఘం వనభోజన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని వారు మంత్రి తుమ్మలను ఆహ్వానించారు. అనంతరం మంత్రి తుమ్మలను వారు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమ్మ మహజన సంఘం మండల అధ్యక్షులు వీరపనేని చెన్నకేశవరావు, ఉపాధ్యక్షులు దొడ్డ తిరుపతిరావు, యాలమాటి పూర్ణచందర్‌రావు, పోశం భాస్కర్, మేదరమెట్ల యాదగిరి, దారపునేని హరి, దొబ్బల వెంకటప్పయ్య, నామా వెంకటేశ్వరరావు, దండా రాధాకృష్ణ, గుడిపూడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం


అశ్వారావుపేట: కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ములకలపల్లి: ములకలపల్లిలో విజయకేర్ మల్టీస్పెషాలిటీ హాస్పటల్, పాల్వంచ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. స్థానిక సర్పంచ్ బీబినేని వీరభద్రం, ఉపసర్పంచ్ శనగపాటి అంజన్‌రావు శిబిరాన్ని ప్రారంభించగా.. డాక్టర్లు గోపీనందన్, అనూషలక్ష్మి 200 మందిని పరీక్షించి, వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ పుల్లూరి ప్రణయ్, గ్రామపెద్దలు తేళ్ల చెన్నయ్య, పుష్పాల చందర్‌రావు. బండారి పోచాలు, బిక్కుమళ్ల సుధాకర్, పద్దం బుజ్జి, పుల్లూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

అశ్వారావుపేట: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయంతమైంది. మండలంలోని వినాయకపురం గ్రామంలో నిర్వహించిన ఈ శిబిరంలో కంటి సంబంధిత వ్యాధులతో బాధ పడే వారికి వైరా కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు దుర్గారావు, చలపతిరావు, యూఎస్ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ముస్లింల వినతి

అశ్వారావుపేటరూరల్: ముస్లిం మైనార్టీ పెద్దలు, కమిటీ బాధ్యులంతా ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణను కలిశారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఆయన నివాసంలో కలిసి ముందుగా ఎమ్మెల్యేను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అశ్వారావుపేటలోని మదీనా మసీద్‌లో వజూఖన (షెడ్డు నిర్మాణం), పామాయిల్ ఫ్యాక్టరీ వద్దగల మదర్సాలో తరగతి గదులకు భవనం, చూట్టు ప్రహార గోడ, ఫైర్ కాలనీలో నూతన మసీదు నిర్మాణానికి భవనం మంజూరు చేయాలని వినతి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, మైనార్టీ బాధ్యులు ఎండి నజీర్, షేక్ బాజీ, ఎస్‌కే సర్దార్, షాకీర్, షరీఫ్, మౌలాలి, అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వినతి

ములకలపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం గండుగులపల్లిలోని స్వగృహంలో ఎమ్మెల్యే జారెను కలిసి దుశ్శాలువతో సత్కరించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని. నెలకు రూ.19,500 వేతనం చెల్లించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అభ్యర్థించారు. జీపీ కార్మికులు జేఏసీ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, చిటికె రామకృష్ణ, అవులూరి రాంబాబు, గద్దల మహేశ్, బాణోతు శంకర్, సాయిరత్న, శనగాని శంకర్ తదితరులు ఉన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న మంగీలాల్

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు ఏ.మంగీలాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కాంట్రాక్ట్ సెక్యూరిటి గార్డులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల వేతన పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు పేర్కొనడం సంతోషదాయకమన్నారు. కేవలం ప్రకటనలకే కాకుండా సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాలు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సముచిత న్యాయం కల్పించేందుకు డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క సింగరేణిలో అవకతవకలను పరిశీలనలు చేయడం, శ్రమ దోపిడి విముక్తికై ఉన్నతాధికారులతో సమీక్షలు చేసి కోల్ ఇండియా వేతనాలు, జీవోల గెజిట్ పై చర్యలకు పూనుకోవడం హర్షణీయమన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించి సింగరేణి వ్యాప్తంగా ఉన్న 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. తొలుత పదవీ బాధ్యతలు చేపట్టిన డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కకు శుభాభినందనలు తెలిపారు.

వైభవంగా సుదర్శన హోమం


సుదర్శన హోమం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైభవంగా సుదర్శన హోమం జరిపించారు. ఆదివారం శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చనలు, గోత్రనామార్చనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో అర్చకుడు గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమాన్ని జరిపించారు. ఆలయంలో నిర్వహించిన సుదర్శన హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

ధనుర్మాస ఉత్సవాలు..

ఆలయంలో ధనుర్మాస వైకుంఠ, ఏకాదశి అధ్యయనోత్సవాల వేడుకలను వైభవంగా ప్రారంభించారు. స్వామి వారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యపాశురవిన్నపము, గ్రామసేవ తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు.